క్లుప్తంగా

పేదల అభివృద్ధికి సీఎం జగన్ కృషి



అంబాపురం(విజయవాడరూరల్): రాష్ట్రంలో పేదల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని విజయవాడ రూరల్ ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి అన్నారు. అంబాపురం పంచాయతీ ఆఫీసు వద్ద శనివారం గ్రామ ఇన్‌చార్జి కార్యదర్శి చెన్నకేశవరావు అధ్యక్షతన జగనన్న సురక్ష శిబిరం జరిగింది. లబ్ధిదారులకు 487 ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ సర్పంచి గండికోట సీతయ్యకు ఉత్తమ సేవా అవార్డు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కె.సువర్ణరాజు, ఎంపీడీఓ బీఎల్వీ శేషగిరిరావు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గన్నవరం రూరల్: పట్టణంలోని ఆర్య వైశ్య కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గన్నవరం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మదుపల్లి బాలకృష్ణమూర్తి తెలిపారు. ఆయన శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గుండె, ఊపిరితిత్తులు, ఆస్తమా, క్యాన్సర్, లివర్, థైరాయిడ్, గ్యాస్, మలబద్ధకం, క్షయ, షుగర్, బీపీ, స్త్రీలకు సంబంధించిన వ్యాధులకు వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. వాసవీ క్లబ్ మిత్ర, గన్నవరం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవలు అందిస్తామని తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు.

నిందితుడిపై పోక్సో కేసు

పెనమలూరు: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడిపై పెనమలూరు పోలీసులు శనివారం పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని యనమలకుదురు డొంకరోడ్డులో 11 ఏళ్ల బాలిక కుటుంబ సభ్యులతో నివసిస్తోంది. ఆ బాలిక ఆరో తరగతి చదువుతోంది. బాలిక తల్లిదండ్రులు లేని సమయంలో దిలీప్ (30) ఆమె ఇంటికి వెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక భయంతో ఏడవటంతో అతను పారిపోయాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



గన్నవరం రూరల్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మొక్కలు నాటారు. ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌ల ఆధ్వర్యంలో వీరపనేనిగూడెం, సూరంపల్లి, తెంపల్లి గ్రామాల్లో పలు ప్రభుత్వ సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆ గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో సర్పంచులు పులపాక బాబూరావు, కొలుసు శిరీష, ఆరేపల్లి జేజమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళపై భర్త హత్యాయత్నం

పెనమలూరు: మండలంలోని కానూరులో ఓ మహిళపై ఆమె భర్త హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్ బాబు కథనం మేరకు.. కానూరులో నివసించే కె.అప్పారావు, శివాని దంపతులకు ఇద్దరు పిల్లలు. రెండు నెలల క్రితం మండడం నుంచి అప్పారావు కానూరుకు వచ్చి నివసిస్తున్నాడు. అతను హోటల్‌లో పనులు చేస్తాడు. అప్పారావు పేకాడి రూ.20 లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. దీంతో తరచుగా అదనపు కట్నం తీసుకురావాలంటూ భార్యను వేధించసాగాడు. శుక్రవారం అప్పారావు, శివాని గొడవపడ్డారు. ఈ నేపథ్యంలో అప్పారావు భార్యపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. గోసాలలో ఉంటున్న శివాని సోదరి కల్పనకు అప్పారావు ఫోన్ చేసి తన భార్యను చంపేశానని చెప్పి పరారయ్యాడు. శివాని కుటుంబ సభ్యులు వెంటనే కానూరుకు వచ్చి చూడగా శివాని తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉంది. దీంతో ఆమెను హుటాహుటిన విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కల్పన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపు జాబ్ మేళా

కైకలూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో కైకలూరు - ఏలూరు రోడ్డులోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాల వద్ద సోమవారం ఉదయం జాబ్ మేళా జరుగుతుందని విజ్ఞాన్ ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ, కరస్పాండెంట్ జి.రంగారావు శనివారం చెప్పారు. జాబ్ మేళాలో 15 కంపెనీలు పాల్గొంటాయని, సుమారు 1,200 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉందన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, బి.టెక్ విద్యార్హతతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఆకర్షణీయమైన జీతంతో ఉద్యోగాలు కల్పిస్తాయన్నారు. యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఏనుగుల కోడు డ్రెయిన్‌కు మోక్షం

- పూడిక, గుర్రపు డెక్కతో నిండిన డ్రెయిన్
- చిన్నపాటి వర్షానికే నీట మునుగుతున్న పంట పొలాలు
- పూడికతీత పనులు చేపట్టాలని ఎమ్మెల్యే పార్థసారథి సూచనలు
- స్పందించి ప్రక్షాళన చర్యలు చేపట్టిన అధికారులు



పెదపులిపాక వద్ద ఏనుగుల కోడులో పూడిక తీస్తున్న పొక్లెయిన్

పెనమలూరు: మండలంలోని ఏనుగుల కోడు డ్రెయిన్ ప్రక్షాళనకు ఎట్టకేలకు మోక్షం లభించింది. డ్రెయిన్‌లో పూడిక వల్ల తాము ఎదుర్కొంటున్న సమస్యలను రైతులు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సారథి వెంటనే స్పందించి డ్రెయిన్‌లో పూడిక తీత పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. దీంతో అధికారులు స్పందించి డ్రెయిన్ ప్రక్షాళన పనులను శనివారం ప్రారంభించారు.

పెనమలూరు మండలంలోని తాడిగడప నుంచి వల్లూరుపాలెం వరకు ఏనుగుల కోడు డ్రెయిన్ విస్తరించి ఉంది. వందల ఎకరాల పంటపొలాల నుంచి వృథానీరు ప్రవహించేందుకు ఏనుగుల కోడు డ్రెయిన్ ఒక్కటే ఆధారం. అయితే ఈ డ్రెయిన్‌లో చాలా కాలంగా పూడిక తీత పనులు చేపట్టలేదు. దీంతో తాడిగడప, పెదపులిపాక, పెనమలూరు, చోడవరం, వణుకూరు, కాసరనేనివారిపాలెం, మద్దూరు, రోయ్యూరు తదితర ప్రాంతాల్లో పంట పొలాలు ముంపుబారిన పడుతున్నాయి. డ్రెయిన్‌లో ప్రవాహం లేక చిన్నపాటి వర్షం పడినా పొలాల్లోని నీరు అక్కడే నిల్వ ఉంటోంది. దీంతో పొలాలు ముంపుబారిన పడుతున్నాయి. వారం రోజులుగా కురిసిన వర్షాలకు కూడా డ్రెయిన్‌లో నీటి ప్రవాహం జరగక పొలాలు ముంపుబారిన పడి చెరువులను తలపించాయి. గత పాలకుల నిర్లక్ష్యంతో ఇప్పటి వరకూ రైతులు తీవ్రంగా నష్టపోయారు. గత ఏడాది రొయ్యూరు ప్రాంతంలో ప్రభుత్వం పూడిక తీత పనులుచేయించింది. ఇప్పుడు మిగతా గ్రామాల పరిధిలో పనులు చేపట్టారు.

రైతుల గోడుతో ఎమ్మెల్యే స్పందన

పలు గ్రామాల రైతులు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథిని శుక్రవారం కలిసి ఏనుగుల కోడుతో తరచుగా జరుగుతున్న నష్టాన్ని విన్నవించారు. ఆయన స్పందించి వెంటనే డ్రెయినేజీ శాఖ ఉన్నతాధికారులతో మట్లాడారు. వెంటనే ఏనుగుల కోడులో పూడిక తీతకు అనుమతులు మంజూరు చేయించారు. ఏనుగుల కోడు డ్రెయిన్ దాదాపు 22 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. డ్రయిన్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్కతో పాటు పిచ్చి మొక్కలు, ఆక్రమణలు తొలగిస్తున్నారు. టన్నుల కొద్ది పిచ్చి మొక్కలు, పూడికను డ్రెయిన్ నుంచి తొలగిస్తున్నారు. మరోసారి అధిక వర్షం పడితే పంట పొలాలు ముంపుకు గురికాకుండా చర్యలు చేపట్టారు.

రైతులకు మేలు

ఏనుగుల కోడు డ్రెయిన్‌లో పూడిక తీయడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ డ్రెయిన్‌లో ఎప్పటికప్పుడు పూడిక తీత పనులు చేపడితే సమస్య రాదు. ఎమ్మెల్యే పార్థసారథి చొరవతో డ్రెయినేజీ శాఖ అధికారులు పూడిక తీత పనులు ప్రారంభించారు.

– గుంటూరు శ్రీనివాసచౌదరి, సర్పంచి, పెదపులిపాక

ముంపు బాధిత రైతులను ఆదుకుంటాం



నీట మునిగిన పొలాలు పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: అధిక వర్షాల కారణంగా ముంపు బారిన పడిన పంట పొలాలకు చెందిన రైతులను ఆదుకుంటామని పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి భరోసా ఇచ్చారు. ఆయన శనివారం గంగూరు గ్రామంలో నీట మునిగిన పొలాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఊహించని విధంగా అధిక వర్షాలు కురవడంతో పంటపొలాలు ముంపునకు గురయ్యాయన్నారు. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ.15 వేల వరకు ఖర్చు చేశారని పేర్కొన్నారు. పొలాల్లో ఉన్న నీరు బయటకు వెళ్లటానికి చర్యలు తీసుకుంటామన్నారు. గంగూరు గ్రామ పరిధిలో ఉన్న మురుగు చిన్నకోడు, పెద్ద కోడు పూడిక వెంటనే తీయిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఇప్పటికే తాను పర్యటించిన ప్రాంతాల్లో ఉన్నతాధికారులతో మాట్లాడి డ్రెయిన్లలో పూడిక తీత పనులు చేపట్టామని వివరించారు. రైతులకు తక్కువ కాలవ్యధిలో పండే వరి విత్తనాలు కూడా అందిస్తామని తెలిపారు. ఈ పర్యటనలో రైతులతో పాటు వైఎస్సార్ సీపీ నేతలు అక్బర్‌పాషా, హుమయున్, గని, బంగారు నాగేంద్రబాబు, అజీజుల్లాఖాన్, రఫీ, చిట్టూరి సుబ్బారావు, పి.రాజేష్, ఏసయ్య పలువురు పాల్గొన్నారు.

ముంపులోనే పంటపొలాలు





మద్దూరులో నీటమునిగిన పొలాలు, కాసరనేనివారిపాలెంలో రోడ్డు మీదుగా ప్రవహిస్తున్న ఏనుగులకోడు

కంకిపాడు: వర్షం తెరిపిచ్చినా దాని ప్రభావం ఇంకా కనిపిస్తూనే ఉంది. పంట పొలాలు ఇంకా నీటి ముంపులోనే ఉన్నాయి. అల్పపీడన ప్రభావంతో ఐదు రోజులు పాటు కురిసన భారీ వర్షాలకు రహదారులు, పంట పొలాలు చెరువులుగా మారాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో వరి నాట్లు పూర్తయిన, నేరుగా విత్తిన పొలాలు ఐదు వేల ఎకరాలు నీట మునిగాయి. ప్రధానంగా ముస్తఫా కోడు, ఏనుగుల కోడు కారణంగా పంట పొలాల్లో నీరు చేరి, సమీప రహదారుల మీదుగా ప్రవహించింది. పొలాల్లో నిలిచిన నీటిని పంట కాలువలు, మురుగు బోదెల్లోకి మళ్లించి పంటను కాపాడుకునేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. ముంపు సమస్యను ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి స్వయంగా పరిశీలించారు. డ్రెయినేజీ, ఇరిగేషన్ శాఖల అధికారులు నాలుగు ప్రొక్లెయిన్లతో కోలవెన్ను, పునాదిపాడు, ఈడుపుగల్లు డొంక ప్రాంతాల్లో పూడికతీత పనులను చేపట్టారు. దీంతో రైతులు కాస్త ఊరట చెందుతున్నారు.

వేల్పూరులో అభివృద్ధి పరుగులు



నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయం మొదటి అంతస్తు



చెరువు వద్ద రోడ్డు మార్జిన్‌లో నిర్మించిన రిటైనింగ్ వాల్



నిర్మాణం పూర్తయిన వేల్పూరు-గంగూరు డొంక రోడ్డు

- మౌలిక వసతుల కల్పన దిశగా గ్రామం
- ఇప్పటికే రూ.2.32 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు
- ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారం

కంకిపాడు: మండలంలోని వేల్పూరు గ్రామంలో అభివృద్ధి పరుగులు తీస్తోంది. మౌలిక వసతుల కల్పనతో ప్రజలకు సౌకర్యాలు సమకూరుతున్నాయి. అధికారులు ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరిస్తున్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక దీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి.

రూ.2.32 కోట్లతో పనులు

గతంలో ఎన్నడూ లేని విధంగా గడిచిన నాలుగున్నరేళ్లలో వేల్పూరు గ్రామం ప్రగతి వైపు సాగుతోంది. ఇప్పటికే రూ.2.32 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పనులు కొన్ని పూర్తవగా, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో రూ.25.50 లక్షలతో సిమెంటు రహదారులను నిర్మించారు. ఎస్సీ శ్మశానవాటికకు ప్రహరీ, ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రహరీ పనులను రూ.6 లక్షలతో చేపట్టారు. హిందూ శ్మశాన వాటికను దాతల వితరణతో మెరక చేయించారు. పైపు కల్వర్టును రూ.3 లక్షలతో నిర్మించి, కర్మకాండల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులను పంచాయతీ కల్పించింది. రూ.25 లక్షలతో గ్రామ సచివాలయం మొదటి అంతస్తు నిర్మాణం చేపట్టారు. రూ.21.80 లక్షలతో చేపట్టిన రైతుభరోసా కేంద్రం పనులు పునాదులు దాటాయి. వెల్‌నెస్ సెంటర్ నిర్మాణాన్ని రూ.17.50 లక్షలతో ప్రారంభించారు. తాగునీటి వసతుల కల్పనకు పంచాయతీ ప్రాధాన్యం ఇచ్చింది. గ్రామంలోని మూడు జగనన్న లే అవుట్లలో మూడు బోర్లు నిర్మించి పైపులైను ఏర్పాటు పనులకు రూ.27 లక్షలు కేటాయించింది. వేల్పూరు గ్రామ శివారు లక్ష్మీపురానికి తాగునీటిని సమృద్ధిగా అందించేందుకు రూ.లక్షతో పైపులైను విస్తరించారు. రూ.39 లక్షలతో గ్రామంలోని వివిధ పాఠశాలలను ప్రభుత్వం నాడు-నేడు ద్వారా కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది.

దీర్ఘకాలిక సమస్యలపై దృష్టి

మౌలిక వసతుల కల్పనతో పాటుగా దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం, పంచాయతీ పాలకవర్గం అడుగులు వేస్తోంది. వేల్పూరు శివారు లక్ష్మీపురం బ్రిడ్జి నుంచి గంగూరుకు ఉన్న డొంక రోడ్డును మండల పరిషత్ నిధులు రూ.16 లక్షలతో అభివృద్ధి చేశారు. గత ప్రభుత్వం రోడ్డు విస్తరణ, డొంక సర్వే పనులను విస్మరించింది. ఎమ్మెల్యే పార్థసారథి ప్రత్యేక చొరవ తీసుకుని డొంకను సర్వే చేయించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. దీంతో రాకపోకలకు సౌకర్యంగా మార్గం తయారైంది. దీంతో పాటుగా గ్రామంలోని పంచాయతీ ప్రధాన సెంటరులో ఉన్న చెరువు రోడ్డు మార్జిన్ కోతకు గురవుతుంది. ఈ సమస్యపై రాజ్యసభ్య నిధులు రూ.50 లక్షలు కేటాయించటంతో రోడ్డు మార్జిన్ వైపు పకడ్బందీగా రిటైనింగ్ వాల్ నిర్మించారు. చెరువు ఆధునీకరణ పనులు చేపట్టడం విశేషం.

అభివృద్ధే లక్ష్యం



గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యం. అర్హులందరికీ ప్రభుత్వ మార్గదర్శకాలతో సంక్షేమ పథకాలను అందిస్తున్నాం. మౌలిక వసతులు కల్పన దిశగా అభివృద్ధి చేపడుతున్నాం. వేల్పూరు – ఉప్పలూరు ప్రధాన రహదారి అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ఎమ్మెల్యే పార్థసారథి ద్వారా సమస్యను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే సమస్య పరిష్కారమవుతుంది.

– చెన్నుబోయిన శివనాగేంద్రమ్మ, సర్పంచ్, వేల్పూరు

వేగంగా రోడ్డు నిర్మాణం



గన్నవరం రూరల్: మండలంలోని కేసరపల్లి గ్రామంలో పోస్టాఫీస్ రోడ్డు నిర్మాణం వేగంగా కొనసాగుతోంది. గతంలో కొంత వరకూ నిర్మించి మిగిలిన రోడ్డును వదిలివేయటంతో గ్రామస్తులు పలుసార్లు ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీ, సర్పంచ్ లక్ష్మీ మౌనిక చొరవతో రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. పంచాయతీ వార్డు సభ్యులు మూల్పూరు మాధవన్ ఎమ్మెల్యేకు, సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

దుస్తులు, పండ్ల పంపిణీ



గన్నవరం రూరల్: మండలంలోని కేసరపల్లి లెప్రసీ కాలనీలో రోగులకు బోయపాటి వెంకట సుబ్బయ్య, సుబ్బమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు సీతారామాంజనేయులు, శ్రీమన్నారాయణ శనివారం దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. తల్లిదండ్రుల పేరిట సేవా కార్యక్రమాలు చేయటం సంతృప్తినిస్తోందని వారు చెప్పారు.

120 మంది వృద్ధులకు కంటి పరీక్షలు



కంకిపాడు: కళ్లను నిర్లక్ష్యం చేయొద్దని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్ సూచించారు. మండల కేంద్రమైన కంకిపాడు -3 సచివాలయ పరిధిలోని డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో శనివారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. 120 మంది అవ్వాతాతలకు కంటి పరీక్షలు చేసి అవసరమైన మందులు, పలువురుకి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఆస్పత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మంజు ఫిల్మేనా, కృష్ణకుమారి, సుజాత, పార్వతి, దుర్గ పాల్గొన్నారు.

ఘనంగా జేఆర్‌డీ టాటా జయంతి



జేఆర్‌డీ టాటా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సీతారామ్ తదితరులు

పెనమలూరు: పారిశ్రామికవేత్త, భారతరత్న జేఆర్‌డీ టాటా జయంతి కానూరులో శనివారం ఘనంగా నిర్వహించారు. జేఆర్‌డీ టాటా ఎస్టేట్‌లోని ఐలా కార్యాలయంలో జేఆర్‌డీ టాటా విగ్రహం, చిత్రపటానికి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కె.ఎస్.ఎస్. సీతారామ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీతారామ్ మాట్లాడుతూ జేఆర్‌డీ టాటా భారతదేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టానికి కృషి చేశారని కొనియాడారు. పారిశ్రామికవేత్తలకు ఆయన మార్గదర్శకులుగా నిలిచారన్నారు. మానవ విలువలు, ధార్మికతకు ఆయన ఎంతో ప్రాధాన్యం ఇచ్చారని వివరించారు. ఈ సందర్భంగా జేఆర్‌డీ టాటా ఎస్టేట్ చైర్మన్ తాతినేని వినోద్‌బాబు, జెడ్‌ఎం సీతారామ్‌ను ఘనంగా సత్కరించారు. ఏపీ ఎంఎస్ఎంఈ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు బాయిన వెంకట్రావు, అధ్యక్షుడు దోనేపూడి దుర్గాప్రసాద్, విజయవాడ ఇండస్ట్రియల్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయి, కార్యదర్శి టి.వి. నాగేశ్వరరావు, ఆటోనగర్ సంఘ మాజీ అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్, మాజీ కార్యదర్శి అన్నే శివ నాగేశ్వరరావు, జేఆర్‌డీ టాటా ఐలా కార్యదర్శి టి. శ్రీనివాసరావు, సభ్యులు పి.హరిశ్చంద్రప్రసాద్, వి.వి.నీరజ్‌కుమార్, అన్నం నరసింహారావు, వినయ్ కుమార్, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఏడు వేల ఎకరాలు నీట మునక

ఉంగుటూరు: మండలంలో కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగి ప్రవహించడంతో సుమారు ఏడు వేల ఎకరాలు నీటమునిగినట్లు వ్యవసాయశాఖ అధికారి హరీష్‌కుమార్ తెలిపారు. గ్రామాల్లో వ్యవసాయ సహాయకులుఎప్పటికప్పుడు నీటమునిగిన పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు చేస్తున్నారని చెప్పారు. వర్షం తగ్గడంతో రైతులు పొలాల్లో చేరిన వరద నీరు బయటకు మళ్లిస్తున్నారు. అవసరమైన వారికి రాయితీపై వరి విత్తనాలను అందజేస్తున్నామని ఏఓ పేర్కొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ సహాయకులు

కాలువలో మృతదేహం

గన్నవరం రూరల్: మండలంలోని బుద్ధవరం గ్రామం వద్ద ఏలూరు కాలువలో శనివారం గుర్తు తెలియని పురుషుడి మృతదేహం కొట్టుకొచ్చింది. వీఆర్వో నుంచి సమాచారం అందుకున్న గన్నవరం పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఆ మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి వయసు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. ఎత్తు 5.5 అడుగులు ఉంటుందని, మృతదేహంపై ఎరుపు, నలుపు కలిసిన గళ్ల చొక్కా, నలుపు రంగు జీన్స్ ఫ్యాంటు, నలుపు, ఎరువు రంగు చెప్పులు ఉన్నాయని పేర్కొన్నారు. బ్లూ కలర్ ఆపిల్ ఐఫోన్, బ్లాక్ కలర్ పర్సు, ఐప్యాడ్, యూనియన్ బ్యాంక్ ఏటీఎం కార్డు, రుద్రాక్ష కలిగి ఉన్న రోల్డ్ గోల్డ్ చైన్, మరో రోల్డ్ గోల్డ్ చైన్ ఉన్నాయని, మృతుడి ఆచూకీ తెలిసిన వారు గన్నవరం పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రమాదకరంగా వంతెన అప్రోచ్



అప్రోచ్ కూలిపోయిన పెదపులిపాక వంతెన

పెనమలూరు మండలంలోని పెదపులిపాక గ్రామంలో వంతెన అప్రోచ్ కుంగిపోయి ప్రమాద భరితంగా ఉంది. విజయవాడ-అవనిగడ్డ కరకట్ట నుంచి గ్రామంలోకి రావటానికి కేఈబీ కెనాల్‌పై ఉన్న వంతెన అప్రోచ్ కాలువలో నీటి ఉధృతితో కూలిపోయింది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు, వాహన చోదకులు కోరుతున్నారు. అప్పటి వరకు ప్రమాద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు.

– పెనమలూరు

సమస్యల పరిష్కారానికి చర్యలు



ప్రజల సమస్యలు ఆలకిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడటౌన్: సాంకేతిక లోపాల వల్ల ప్రభుత్వ పథకాలు అందని ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అధికారులకు సూచించారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆయన నివాసంలో నియోజకవర్గానికి చెందిన పలు ప్రాంతాల ప్రజలు శనివారం ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరించారు. దీనిపై ఎమ్మెల్యే కొడాలి నాని అధికారులతో మాట్లాడుతూ సాంకేతిక లోపాలు గుర్తించి వాటి పరిష్కారానికి ఉన్నతాధికారులతో చర్చించాలన్నారు. ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందని, అవి ఏ కారణంచేతనూ లబ్ధిదారుడికి అందకుండా ఉండకూడదన్నారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం

పమిడిముక్కల: మొహర్రం పదో రోజు సందర్భంగా మండలంలోని అలీనఖీపాలెంలో రెండు మసీదుల్లో చెస్ట్ బీటింగ్ చేశారు. రక్తం చిందించి కర్బలా అమరవీరులకు నివాళులర్పించారు. యా హుస్సేన్.. యా అబ్బాస్ అంటూ బ్లేడులు, జింజర్లతో ఒంటిపై గాట్లు పెట్టుకొని రక్తం చిందించారు. చిన్న, పెద్ద తేడాలేకుండా అందరూ చెస్ట్ బీటింగ్‌లో పాల్గొన్నారు. గ్రామంలో పీర్లను ఊరేగించారు. రెండు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ బలిదానానికి ప్రతీక, ప్రాణ త్యాగం చేసిన కర్బలా అమరవీరులను స్మరించుకోవడమే మొహర్రం. గదీర్ సొసైటీలో మత గురువు సయ్యద్ నవీద్ అబిది ప్రత్యేక ప్రార్థనలు జరిపించారు. సొసైటీ వైస్ చైర్మన్ షా జవాద్ అలీ, కార్యదర్శి హుస్సేన్ అలీ పాల్గొన్నారు.